70206900l

శైలే శైలే విహరతి దైవమ్
విపినే విపినే విచరతి దైవమ్
గ్రామే గ్రామే ఖ్యాతం దైవమ్
నగరే నగరే ప్రథమ దైవమ్.

జాతి గౌరవంబు నీతిపై నిలుచును
నీతి లేక యున్న జాతి చెడును
నీతి కలుగు జాతి నిజమైన జాతిరా
వినుడు భారతీయ వీరసుతుడా.

శైలే శైలే విహరతి దైవమ్. పర్వతముల యందు వున్నతమైన స్థాయి యందు వుత్తేజమైన భావములతో వుత్సాహ లూగుచు విహరించేదంతా దైవమే. విపినే విపినే విచరతి దైవమ్. అడవుల యందు ప్రశాంతమైన వాతావరణమునందు, అనుభూతముల యందు, చల్లని గాలుల యందు, పిల్లని వాయువునందు విహరించేది యీ దైవము. ప్రతి గ్రామము నందు మానవ తేజస్సుతో, దివ్యమైన ప్రకాశముతో, మానవత్వముతో అన్యోన్యమైన అనుకూలతతో దివ్యమైన వాతావరణము గరపేవాడు దైవము. పట్టణములందు అందచందములతో అనుకూల వాతావరణములో దివ్యాను భూతులతో మానవులను వికసింప జేసి, ప్రకటింప జేసి దివ్యమైన తత్వాన్ని వెదజల్లేవాడు దైవమే.

కర్ణాటక దేశమందు మల్లమ్మ అనే ఆమె చక్కగా దైవాన్ని, దివ్యరూపమైన సర్వాంతర్యామి తత్వాన్ని ప్రకటింప జేసింది.

గ్రామకెల్ల మనెయె శృంగార
గగనకెల్ల చంద్రనే శృంగార
సముద్రకెల్ల అలయె శృంగార.

కొలనుకు తామర పుష్పమే శృంగారము. గ్రామమునకు గృహములే శృంగారము. సముద్రమునకు తరంగములే శృంగారము. ఆకాశమునకు చంద్రుడే శృంగారము. సర్వత్ర సౌందర్యమైన శృంగారమే దైవ స్వరూపము. కనుకనే ఉపనిషత్తులు సత్యం శివం సుందరం అని

702069002

వర్ణిస్తూ వచ్చాయి. మానవునకు మానవత్వమే శృంగారము. మానవ సమాజములో ప్రధానముగా వుండవలసినది మానవత్వము. ఎన్ని విద్యలు నేర్చినా ఎంతటి పైజ్ఞానిని కూర్చినా ఎంతటి పదవులనేలినా దానితో పాటు మానవత్వమును అభివృద్ధి గావించుకోవాలి. మానవత్వమును యెంతెంత అభివృద్ధి గావించుకొందుమో సమాజము, రాజ్యము, దేశము కూడను అంతంత అభివృద్ధి అవుతుంది. మానవత్వమే కోల్పోయిన సమాజము యొక్క గౌరవము కూడను కోల్పోతుంది. సమాజముపై ఆధారపడిన దేశము కూడను తన గౌరవమును కోల్పోతుంది. కనుక మానవ జాతి యొక్క గౌరవము నీతి జాతీయతలో కూడిన మానవత్వముపైన ఆధారపడి వుంటున్నాది.

ఈనాడు విద్యార్థులు పోషించుకోవలసినది మానవత్వమే. ఈ మానవత్వమన్నది ఒక్క ఆధ్యాత్మిక వాతావరణమునందు మాత్రమే అభివృద్ధి కాగలదు. అన్యవాతావరణమందు యీ మానవత్వము అభివృద్ధి అగుటకు అవకాశము లేదు. విత్తనము మట్టిలో నాటి నీరు పోసినప్పుడే అది మొలకై వృక్షమై ఫలముల నందిస్తుంది. అట్లుగాక బీజమును ఒకటిన్నులో పెట్టి నీరు పోస్తే కుళ్లిపోతుంది. కనుక నీతి నిజాయితీ లన్నది మానవతా హృదయమునందు మాత్రమే అభివృద్ధి అగుటకు అవకాశము వున్నది. మానవ సమాజములో మనము అభివృద్ధి గావించుకోవలసినది మానవత్వమే. ఇట్టి మానవత్వమునకు సద్గుణములు ఆధారము, మూలము నీతి. నీతి అనగా నడత యొక్క పరిపూర్ణతయే. భోగభాగ్యములుగాని, సిరిసంపదలుగాని నీతిపైననే ఆధారపడి వుంటున్నవి. నీతి మానవుని ఉన్నతస్థాయికి గొనిపోయేటువంటిది. మంచి నడతలో కూడినదియే నీతి. ఈ విధమైన నడతను గురించియే మానవత్వము అనాదికాలము నుండి బోధిస్తూ వస్తున్నది. ప్రాచీనకాలమునుండి అన్ని దేశములకు ఆధ్యాత్మిక సంపత్తిలో నీతి నిజాయితీలను బోధించిన దేశము భారత దేశము. నీతి నిజాయితీలే భగవంతుని సత్య నిలయాలు, నిత్య నిలయాలు. కనుక నీతియే లేకుండిన మానవ జాతియే కోల్పోతుంది. ఈనాడు దేశమునకు అవసరమైనది యీ నీతియే. ఈ నీతి అన్ని సమయములందు సర్వత్రా కూడను అత్యవసరముగా పాటించవలసినది. Marshal Hope అనేవాడు యీ నీతి గురించి యుద్ధ సమయమునందు కూడను, ప్రాణాపాయ సమయమునందు కూడను, ఎట్టి కఠినమైన స్థితియందైన కూడను నీతిని మాత్రము విసర్జించ కూడదని బోధించాడు. విక్టోరియా రాణి పరిపాలన సమయమునందు ఆమెకు ప్రధాన మంత్రియైన విలియమ్ గ్లాడ్ స్టోన్

అనేవాడు నీతి నిజాయితీలను లక్ష్యము నందుంచుకొని సర్వకాలములందు దానిని పోషిస్తూ వచ్చేవాడు. కనుకనే విక్టోరియా రాణీ కంటెను ప్రధాన మంత్రిని ప్రజలు అంత గౌరవించేవారు. ప్రజలంటే యితనికి చాలా ప్రీతి. విలియమ్ గ్లాడ్ స్టోన్ ప్రజా పరిపాలనయందు ప్రజలకు విరుద్ధమైన సమయము ఆసన్నమైనప్పుడు విక్టోరియా రాణికి కూడను కఠినముగా బోధించి ప్రజలయొక్క యోగక్షేమమును నీతి నిజాయితీలను పోషించే విధానాన్ని చక్కగా వెలిబుచ్చేవాడు.

ఈ నీతి యింద్రియ నిగ్రహము చేతనే అలవడుతుంది. ఎవరిని వారు శాసించుకోగలిగిన శక్తిగలవారే యితరులను శాసించటానికి అధికారి అవుతాడు. తనకు తానే శాసించుకోలేని బలహీనుడు యితరులను యేరీతిగా శాసించగలడు. కనుక మొట్టమొదటు మానవుడు తనను తాను శాసించుకొనుటకు తగిన కృషి చెయ్యాలి. తన మాట తన ప్రవర్తన రెండు యేకముగావించే జీవితమును గడపాలి. ఈ విధముగా మాట క్రియ యేకమైనప్పుడే తాను మహత్తరమైన విభూతులను అనుభవించగలడు

మాట చెప్పినట్లు మనుజుండు నడచిన
మనిషి కాదు వాడు మహాత్ముడనును.
మాట చెప్పినట్లు మనిషి నడవడేని
మనిషి కాదు తాను మృగమె గాని.

ఈనాటి మానవ సమాజములో మాటకు క్రియకు సంబంధము లేదు. మాట క్రియతో కూడినదే సత్యము. మనసు, మాట, క్రియలో కూడినదే ఋతము. కనుక విద్యార్థులు దేశము యొక్క అభిమానమును, దేశము యొక్క ఔన్నత్యమును, దేశము యొక్క కళ్యాణమును మనసు నందుంచుకొని ప్రవర్తనలయందు ఆదర్శవంతమైన జీవితమును అందించాలి. ఈనాటి విద్యార్థులకు యింద్రియనిగ్రహమంటే యేమిటో వారికి తెలియదు. సంయమము అని దీనికి పేరు. ఈ సంయమము అనేది మానవునకు మాత్రమే చెందినది. ఇంద్రియములను అనుసరించి స్వేచ్ఛా విహారము సల్పుటంచేత మానవుడు చాలా దివ్యత్వమును కోల్పోతున్నాడు. ఇట్టి యింద్రియ నిగ్రహము సాధించటమును సంస్కృతమునందు దమము అని పేరు. ఈ దమమును సాధించినవాడే దాంతుడు. ఈనాడు లోకమునకు దాంతులు కావాలిగాని వేదాంతులు అక్కరలేదు. ఈనాటి వేదాంతములన్నియు కేవలము మాటలలో మాత్రమే జరిగిపోతున్నది. వాచాలత్వము అధికమై పోతున్నది. ఆడంబరములు

అధికమైపోతున్నాయి. ఆచారములు సన్నగిల్లుతున్నాయి. కనుకనే ఆనందము శూన్యమైపోతున్నది. కనుక ప్రతి విద్యార్థి కూడను దాంతుడు కావాలి. ఈనాటి విద్యార్థి చదువు సంధ్యలకు పూర్వమే ఆడంబరము, అహంకారము దేహమంతా నఖశిఖపర్యంతము వ్యాపించి పర విహారము సల్పుతున్నది. విద్యార్థులకు హృదయమన్నది యేమాత్రము తెలియదు. పెద్దలతో యేవిధముగా సంభాషించాలి, పెద్దల ముందు యేవిధముగా వినయమును ప్రకటించాలి, యేవిధముగా ప్రవర్తించాలి అనే విషయము కూడను యీనాటి విద్యార్థులకు తెలియదు. చెప్పే పెద్దలు కూడను తక్కువ. ఇది విద్యార్థుల దోషము కాదు. తల్లిదండ్రులు, గురువులు దీనికి తగిన ఉత్సాహ ప్రోత్సాహములనందించలేకపోవటమే విద్యార్థుల యొక్క పరిస్థితి యీవిధముగా దిగజారిపోతున్నది. కనుక విద్యార్థులు తమ ప్రవర్తనను సరియైన స్థితియందుంచుకొని తమ యింద్రియములను నిగ్రహించుకొని తద్వారా సమాజము లోపల ప్రశాంతిని పోషించాలి. ఈనాటి పిల్లలకు చిల్లర అల్లర మాటలే చాలా అభిరుచి. ఇదే వారి మోజు, ఫోజు. మంచి మాటలు యేమాత్రము వారికి గిట్టవు. ఆధ్యాత్మికమంటే హాస్యాస్పదముగా భావిస్తారు. ఈ విధమైన వాతావరణము దిన దినమునకు విద్యార్థులు అభివృద్ధి గావించుకోటం చేత విద్యావిధానమనేది వారు గుర్తించుకోలేకపోతున్నారు. కనుక విద్యార్థులు కేవలము ఉద్యోగాల నిమిత్తమని, ధనార్జన నిమిత్తమని యీ దుర్భావమును దూరము గావించుకోవాలి. విద్య కేవలము జీవిత పరమావధి నిమిత్తమని మరువకూడదు. జీవనోపాధి నిమిత్తము ఉద్యోగము ఆచరించవలసినదే. కానీ ఆ ఉద్యోగమునందు కూడను నీతి నిజాయితీలను విడచకుండా మనము ఆ ఉద్యోగములను పోషించి ఆదర్శముగా నిరూపించాలి. ఈనాడు లోకమును మోసము చేయటానికి లంచాలు కొట్టటానికి అన్యాయ అసత్య అక్రమములలో ప్రవేశించటానికి మనము చదివినట్టుగా గుర్తింపబడుతున్నది. మన చదువులు దీని నిమిత్తము కాదు ఏర్పడినది. విద్య జ్ఞాన నిమిత్తము. ఇలాంటి జ్ఞాన పోషణ లేకుండా కేవలము ధన పోషణే మన ప్రధాన లక్ష్యమునందుంచుకోటం చేతనే విద్యావిలువలు క్రమక్రమేణా శూన్యమైపోతున్నాయి. ధనముకాని విద్యకాని చెడ్డది కాదు. మనము వినియోగించుకునే విధానము లోపల దాని గౌరవ మర్యాదలు నిలిచి వుంటాయి.

విద్యార్థులారా! మనము ఎంతగాలిని పీల్చుకుంటున్నామో అంతగాలిని విడువక తప్పదు. విడువకుండిన మన ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. కనుక ధనమును

సంపాదించవలసినదే. విద్యను నేర్చవలసినదే. కాని యీ ధనమును, విద్యను తిరిగి వినియోగపరచాలి. సన్మార్గములో దానిని ప్రవేశ పెట్టాలి. ఈ విధమైన భావము విద్యార్థులలో కలగటం లేదు. చదివిన చదువును సమాజములో ప్రవేశ పెట్టినట్లైతే సమాజములో ప్రజలకు సరైన ఆనందమును, అనుకూలతను మనము అందించాలి. ధనము కూడను సమాజములో సరైన రీతిలో సద్వినియోగ పరచాలి. ఆవిధముగా సమాజములో సద్వినియోగపరచకుండిన యిది కేవలము మట్టిలో సమానము. ఏ సమాజమునుండి మనము ఆర్జించామో ఆ సమాజమునకు తిరిగి మనము అర్పితము గావించాలి. అదేనిజమైన సేవ. కనుక విద్యార్థులయందు త్యాగభావము ఎక్కడా కనుపించటము లేదు. భోగ చేసుకోటం భోగ చేసుకోటం. కాని వారి జీవితములో యిది one way trafficగా యోచన చేస్తున్నారు తీసుకున్న దానిని తిరిగి వినియోగించాలి. తిరిగి అందించాలి. అప్పుడే మానవ జీవితములో మున్ముందు ఉన్నత స్థాయికి చేరగలము. చాలామంది విద్యార్థులకు యీత తెలియదు జలమును మనము వెనుకకు నూకుతూ పోతుంటే మనదేహము ముందుకు కొనసాగిపోతుంది. జలమునే మనము వెనకకు తోయకుండిన మనదేహము ముందుకు కదులలేదు. వెనుకకు తోస్తూ పోవాలి. Past is Past. ఈ విధమైన దానిని మనం చేసుకుంటూ పోవటం చేత మనము యెంతైనా జీవితమును ఉన్నత స్థాయికి తీసుకొని పోవచ్చును. ఈనాడు మనము చేయవలసిన త్యాగము కేవలము ధనమును మాత్రమే కాదు. మనము దుర్గుణములను కూడను త్యాగము చేయాలి. త్యాగమంటే యేమిటి? మనదుర్గుణములను త్యాగము చేయటమే త్యాగము

భావమందు దుష్ట భావము విడుట
త్యాగమగును అదియె యోగమగును
ఆస్తి ఆలి పాడి అడవి కేగుట కాదు.

ఆలుబిడ్డలను విడటం అంతగొప్ప త్యాగమేమి కాదు. ధన ధాన్యములను విసర్జించటము గొప్పత్యాగమేమి కాదు. మనసు పడితే యివన్నీ మనము సులభముగా త్యాగము చేయవచ్చు కానీ మనలో దుర్గుణములను వదలటమే నిజమైన త్యాగము. అప్పుడే మన యొక్క మానవత్వము పరిపూర్ణమైన మానవత్వముగా మారిపోతుంది.

విద్యార్థులారా! మానవుడు మానవునిగానైనా జీవించటానికి ప్రయత్నించటం గొప్పపని. మానవత్వమును పశుత్వముగా అనుభవించటము యిది ఘనము కాదు.

కామ క్రోధ లోభ మద మాత్సర్యములనే యీ అరిషడ్వర్గములు మానవుని కేవలము హత మా
ర్చి వేస్తున్నది. చంద్రునికి పదహారు కళలు. ఈ పదహారు కళలు పరిపూర్ణమైన స్థితిని
పొందినప్పుడే, పరిపూర్ణస్థితిని పొంది తనలో యెట్టి మచ్చను లేకుండా ప్రశాంతమైన
ప్రకాంతిని లోకానికి అందిస్తుంది. చంద్రుడు పదహారు కళలు పెంచుకున్నప్పుడే జగత్తుకు
ఆదర్శము. కాని మానవుని యందు పదహారు కళలు వుంటున్నాయి. పదహారు కళలు నిర్మ
లము చేసినప్పుడు మానవత్వమునకు గొప్ప ప్రకాశము. ఏమిటి యీ పదహారు కళలు.
అరిషడ్వర్గములు ఆరు. మదములు ఎనిమిది. రజో తమో గుణములు రెండూ చేరుస్తే పదహా
రు సకాములవుతాయి. ఈ పదహారు మనము నిర్మలము గావించుకోవాలి. అన్నింటియందు
దైవత్వమును మనము విశ్వసించాలి. అది లేకుండా మనము జీవించటానికి ప్రయత్నించి
నప్పుడు కొంతవరకు మానవత్వమును చెడపటానికి ప్రయత్నిస్తుంది. మానవుని యందున్న
కర్తృత్వ భోక్తృత్వములను కొంత వరకు తగ్గించుకోవాలి. అన్నివిధముల భగవంతునికి
అర్పితము చేసి సర్వం బ్రహ్మమయమనే స్థితిలో పలు సత్కర్మలు మనము ఆచరిస్తూ పో
యినప్పుడు భగవంతుడే సహాయము చేస్తాడు.

భాగవతములో మీకు తెలిసిన విషయమే. పరమ భక్తుడైన పోతన భాగవత
మును ప్రారంభిస్తూ

పలికెడిది భాగవతమట
పలికించెడి వాడు రామభద్రుండట నే
పలికిన భవహరమగునట
పలికెద వేరొండు గాథ పలుకగనేలా.

అన్న భగవంతుడే. పలికించెడివాడు భగవంతుడే. పలికేవాడు భగవంతుడే. వ్రాసేవాడూ
భగవంతుడే. వ్రాయించేవాడూ భగవంతుడే. ఏదో నన్ను నిమిత్తమాత్రంగా తీసుకొని యీ
విధముగా వ్రాయిస్తున్నాడని పోతనామాత్యుడు ప్రారంభములోనే భగవంతునికి అర్పిత
ము చేసి తనయొక్క కావ్యాన్ని ప్రారంభించాడు. ఈ విధమైన ఆధ్యాత్మిక భావము చేత తాను
యీ భాగవతమును వ్రాయటము వలననే యిక్కడ యీ ఒక్క పదమునందే తత్వమసి
అనే దివ్యత్వము యిమిడి వుంటున్నది. పలికెడిది భాగవతమట పలికించెడివాడు
వాడు - అదే భగవంతుడు. నే పలికిన - నే - యితనే జీవాత్మ. వాడు - పరమాత్ముడు. నేను -
జీవాత్మ. కనుక తత్వమసి యీ రెండింటి యొక్క ఏకత్వమే యీ భాగవతము అన్నారు.

ఈ భాగవతమందే మానవత్వానికి సరైన మార్గములో ఇముడ్చు కుంటూ వచ్చాడు. మొట్టమొద
టి భక్తి ఆధారము. భక్తి క్రమక్రమేణా పెరుగుతూ రాగా అదే జ్ఞాన స్వరూపాన్ని పొందుతుంది.
ఈ జ్ఞానము ముదిరిపోయినప్పుడే మనకు వైరాగ్యము ప్రాప్తిస్తుంది. ఈ వైరాగ్యమునందే తత్త్వము
మనము అర్థము చేసుకోగలుగుతాము. ఈ తత్త్వజ్ఞానమును పొందిన వ్యక్తియే ముక్తిని
పొందగలడు. కనుకనే భాగవతమనే పదము యొక్క శబ్దమునందే యీ ఐదింటి
యొక్క రహస్యము ఇమిడి వుంది. భా-గ-వ-త-ము. ఐదక్షరాలు. ఇవే పంచభూతములు
ఇవే పంచేంద్రియములు. ఇవే పంచకోశములు ఇవే పంచప్రాణములు. ఈ పంచప్రాణముల
యొక్క సంబంధ బాంధవ్యమైనదే దివ్యత్వము. భా-భక్తి. గ-జ్ఞానము, వ-వైరాగ్యము.
త-తత్త్వము, ము-ముక్తి. ఇదే భాగవతమనేది. భక్తి జ్ఞాన వైరాగ్య తత్త్వముల యొక్క
సమ్మిళిత సంబంధమే ముక్తి. కనుక ప్రతి మానవునకు కూడను భక్తి అత్యవసరము.
ఇదే పునాది. విద్యార్థులు కూడను జీవిత భవనమునకు పునాది వంటి వారే. ఎందుకంటే
మీరు బ్రహ్మచారులు. బ్రహ్మచారి అనే పునాదిపైననే గృహస్థము అనే గోడలు కడుతున్నారు.
ఈ గృహస్థులనే గోడలపైననే వానప్రస్థమనే రూఫ్. ఈ వానప్రస్థమనే రూఫ్ వేసిన తరువాత
నే జీవితమనే దానిని అందులో జరుపుకుంటూ వస్తున్నాము. కనుక జీవిత భవనమునకు
విద్యార్థులు బ్రహ్మచారులు పునాది వంటి వారే. పునాది భద్రముగా లేకున్న భవనమంతా
కూలిపోతుంది.

కనుక విద్యార్థులు మొట్టమొదట సుగుణములను భద్రమైనవిగా అభివృద్ధి గావిం
చుకోవాలి. సుగుణమే లేకుండిన మన జీవితములో శాంతియే వుండదు. మనము సమాజ
ములో పుట్టినాము. సమాజములో పెరిగినాము. సమాజములోనే మనము జీవితమును
గడుపుతున్నాము. సమాజమే లేక మన జీవితమే లేదు. కాని దురదృష్టవశాత్తు యీనాటి
మానవుడు నేను నా కుటుంబము, నేను నా కుటుంబము అనే స్థాయియందే నిలచిపోతు
న్నాడు. సమాజము వరకు తాను ప్రయాణము చేయుటం లేదు. తాను తన కుటుంబము
వరకే ప్రయాణము చేసి అందులో నిల్చిపోతున్నాడు. సమాజమే లేకపోతే నీ కుటుంబము
ఎక్కడ. సమాజమే లేకపోతే నీవెక్కడ. సమాజములో నీవు ఒక వ్యక్తివి. అలాంటి సమా
జాన్ని నీవు విసర్జించి సమాజాన్ని నీవు లెక్క చేయకుండా కేవలము స్వార్థము, స్వప్రయో
జనము నందే జీవితము గడుపుటం చేతనే నీకు శాంతి సౌఖ్యములు దూరమైపోతు
న్నాయి. భక్తులు కూడను మొట్టమొదట తన పని తనకు ముఖ్యము. స్వార్థము. స్వార్థము.

తరువాతనే దైవము యొక్కపని. కనుకనే మానవుడు అనుకున్నంత ఆనందమును అందుకోలేకపోతున్నాడు. నీవు ఎక్కడనుండి వచ్చావు. ఏ ఆధారములో నీవు జీవిస్తున్నావు. ఏ అనుగ్రహములో నీవు ఈ లోకములో అనుభవిస్తున్నావు. దీనిని మరచిపోతున్నారు మానవులు.

కనుకనే భగవంతుని తత్వాన్ని మరచి భౌతికమైన లౌకికమైన ఈ జగత్తును ఆశ్రయించిన వారు కౌరవులని చెప్పవచ్చు. కౌరవులకు ఎంత సిరిసంపదలు వుండినప్పటికి కట్టకడపటికి యేమైపోయారు. సమస్త బంధువులు కూడను కౌరవులకే సహాయము గావిస్తూ వచ్చారు. మహా వీరులు ధీరులు గంభీరులైన వారంతా కౌరవులయందే గొప్పవారిగా నిల్చిపోయారు. కృపాచార్య, ద్రోణాచార్య, భీష్మాచార్య యిలాంటి మహా తెలివితేటలు కలిగిన వారంతా ధీశక్తి కలిగిన వారు కూడను కౌరవుల వైపే వుంటున్నారు. కాని భుజబలము బుద్ధి బలము, ఆయుధబలము యేమాత్రము కూడను వారికి ప్రయోజనము లేక పోయింది. కేవలము ధర్మ బలము, దైవబలము పైనే ఆధారపడిన వారు పాండవులు. కనుకనే ధర్మమును ఆశ్రయించినప్పుడే దైవము మనకు దగ్గరౌతాడని భగవద్గీత స్పష్టముగా చెప్తున్నది. భగవద్గీత ధర్మక్షేత్రే కురుక్షేత్రే అని ధర్మములో ప్రారంభము చేశాడు. కాని కట్టకడపటికి విజయములో అంత్యము గావించాడు. ధర్మములో ప్రారంభించి విజయములో అంత్యము చేసి ఆనందమును అనుభవింప చేశాడు అర్జునునికి. ఏ చిన్న కార్యమునకైనను పాండవులు పరమాత్మను ముందుంచుకొని ఆ కార్యములో ప్రవేశించేవారు. కౌరవులు అది కాదు. తమ స్వార్థము స్వప్రయోజనమును ముందుంచుకొని భగవంతుని వెనుక వుంచేవారు. కనుకనే వారికి అన్ని విధముల కష్టములు నష్టములే సంభవిస్తూ వచ్చాయి. భగవంతుని ముందుంచుకున్న పాండవులకు అన్నీ విజయములే చేకూరినాయి. కష్టములు కొన్ని కలిగినాయి కాని ఆ కష్టముల వల్ల నష్టము యేమాత్రము లేదు. కష్టపడక మనకు సుఖము ప్రాప్తించదు. కష్టే ఫలి. పాండవుల యొక్క స్వరూపము కౌరవుల యొక్క విభాగము ఏ రీతిగా మనము గుర్తించాలంటే కౌరవులు మొట్టమొదట I. అని అహంకారమును ముందుంచుకొన్నారు. First I, next world, Last God. కనుకనే వారికి అన్నీ Lost. అయిపోయింది. పాండవులు అట్లుకాదు. First God. next world Last I. వారు అహంకారమును కట్టకడపటికి చేర్చారు. కనుకనే వారు విజయాన్ని సాధిస్తూ వచ్చారు. అహంకారమును వెనుకకు నెట్టాలి. అహంకారమును ముందు పెట్టకో కూడదు. కనుక మన పవిత్రమై

న చరిత్రలన్నీ అహంకార నిర్మూలన గావించుకునే మార్గములను ఎన్నో ఉపమాన ఉపమేయములుగా బోధిస్తూ వచ్చాయి. విద్యార్థులారా! ఈ వయస్సులోపల మీకు ఈ అహంకారము వుండటము సహజమే. కండ బలము వుండినంతవరకు కండ్లలో అహంకార బలము ప్రకాశిస్తూనే వుంటుంది. యువకుల రక్తము నిరంతరము పరుగులు పరుగులుగానే వుంటుంది. దీనికి ప్రశాంతమైన ప్రసారము వుండనే వుండదు. దేనిని కూడను లెక్క చేయరు. ఇది అహంకార మనే పొరలచేత ఆవరించటము వలన ఎవరిని లెక్క చేయకుండా మంచి చెడ్డలను విచారణ చేయకుండా వుంటారు. పిల్లలందు విచక్షణా జ్ఞానము యేమాత్రము కనుపించదు.

విద్యార్థులారా! వినయ విధేయతలే ప్రధానమైన విద్యగా భావించాలి.

విద్యయొసగును వినయంబు
వినయమునను కలుగు పాత్రత
పాత్రత వలన ధనము ధనము వలన ధర్మంబు
దాని వలన ఇహకాముష్మికంబు బొందు నరుడు.

చూశారా! దైవము మనకు దక్కాలంటే వినయము చేతనే మనకు దైవము లభిస్తాడు. కేవలము దైవముపైన అలక్ష్యము చేయటముగాని లేక అహంకారములో దైవ విషయమును అలక్ష్యము చేసినప్పుడు గాని నీకు యీ విధమైన దివ్యమైన భావములు ప్రాప్తించవు. కనుక విద్యార్థులు యీ వయస్సు చాలా పవిత్రమైన వయస్సు. ఈ కాయమును కర్మను సార్థకము గావించుకోవాలి. చక్కగా చదవండి. మంచి తరగతిలో వుత్తీర్ణులు కండి. ఈ చదువును సమాజములో వుపయోగపెట్టండి. కేవలము డిగ్రీల నిమిత్తమై మీరు చదవనక్కరలేదు ఈ డిగ్రీల వలన వచ్చే ప్రయోజనము యేమీ లేదు. మన పూర్వీకులు యీ విధమైన చదువులు యేమీ చదవలేదు. కాని చదువులు అధికమయ్యే కొలది కూడను అహంకారము పెరుగుతూ వస్తున్నది. అహంకారము పెరిగెనా మన ఆత్మబలము తరిగిపోతుంది. దివ్యత్వము పెరిగెనా అహంకారము తరిగిపోతుంది. ఇవి రెండు కూడను పిల్లలు ఆడే సీ-సా మాదిరి వుంటుంది.

విద్యార్థులారా! ఆధ్యాత్మిక మార్గము అత్యవసరము. దైవ భావము లేక పోవటం చేతనే యీనాడు లోకములో మానవులు క్రూరముగను హీనముగను ప్రవర్తిస్తున్నారు. మనకు ధనము ప్రధానము కాదు.

ధనమెచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణము మానును వేమా.

అన్నారు. ముఖ్యముగా మనకు పదవులు గాని, ధనముగాని, గౌరవ ప్రతిష్టగాని కదలిపోయే మేఘములు. ఈ అహంకారమే మానవుని అధః పతనము చేస్తున్నది. దీనిని బట్టి నీవు ఈ అహంకారమును వినియోగము చేస్తున్నావు. ఏ ఆధారము లేదు యిదే మూర్ఖత్వము. కనుక అహంకారము వుండటం చేతనే మానవుడు తనకు తానే మరచిపోతున్నాడు. తనను తాను మరచుటయే పెద్ద బంధన. తనను తాను గుర్తించుకొనుటయే నిజమైన సాక్షాత్కారము. జపములు, ధ్యానములు, యోగములు, కర్మలు అనేక రకములుగా చేసినప్పటికిని మన యొక్క మనస్తత్వము యేమాత్రము మారలేదు.

విద్యార్థులారా! మనిషి మారినంత మాత్రమున ప్రయోజనము లేదు. మనసు మారాలి. గుడ్డలు మారినంత మాత్రమున వచ్చే ఫలితము యేమీ లేదు. గుణము మారాలి. గుణము మారకుండా యిన్ని విధములైన అభివృద్ధి మార్గములు అనుభవించామని మనము విఱ్ఱవీగినా గాని అది కేవలము వెఱ్ఱితనమే గాని పవిత్రమైన మార్గము కాదు. భవిష్యత్తునకు నాయకులు మీరు సరైన స్థితి యందుండినప్పుడే దేశము సరైన స్థితి ననుభవిస్తుంది. దేశము యొక్క మంచి చెడ్డలన్నీ విద్యార్థులపైనే ఆధారపడి వుంటున్నది. విద్యార్థులు మంచివారైన, నీతి నిజాయితీ మంతులైనప్పుడు దేశము కూడను మంచి ఆదర్శవంతమైన దేశముగా నిరూపించవచ్చు. భారత దేశము అనాది కాలము నుండి యిటి సత్కీర్తి సంపాయించింది. కనుక ఆనాటి సంస్కృతిని తిరిగి మీరు పునరుద్ధరింప చేయండి. ఈ పవిత్రమైన సంస్కృతి వలననే అన్ని దేశములు కూడను అనేకరకములైన ఆనందములను అందుకుంటూ వచ్చారు. కాని యీనాటి భారతీయులే యీ యొక్క ధర్మమును యీ సంస్కృతి యొక్క విశిష్టతను గుర్తించుకోలేక పోతున్నారు. కనుక భారతదేశము సర్వదేశములకు నాయకత్వము వహించినది. పవిత్రమైన దివ్య సందేశము నందించినది. వేద శాస్త్ర యితిహాస పురాణములను ఆదర్శ రూపమైన రీతిలో అన్యోన్యమైన భావముతో ప్రకటించి ప్రచురించినది భారత దేశము. కాని యీనాడు ఆచరణ రూపమైన ప్రచార ప్రబోధలు సన్నగిల్లటం చేతనే మన భారతీయ సంస్కృతిని ఎవరూ గుర్తించటానికి

విలు కాకుండా వున్నది.

విద్యార్థులారా! మూడు మాత్రము మీరు ఎప్పుడూ మరువకూడదు. భారతీయులు సత్యవ్రతులు, ధర్మ పరాయణులు. న్యాయమే భారతీయులకు ఆటపట్టు. కనుక నేను సత్య ధర్మ నీతి నిజాయితీలతో మనము జీవించటానికి కృషి చెయ్యాలి. కనుకనే వేదము సత్యం వద ధర్మంచర అనింది. ఈ రెండింటిని మనము ప్రధానముగా చూసుకోవాలి. ఈ పదహైదు దినములనుంచి కూడను మీరు తెలుసుకొన్న, గుర్తించిన సత్యాలను వర్తించటానికి తగిన ప్రయత్నము చేసినప్పుడే ఇది సార్థకమవుతుంది. దేశము యొక్క అభిమానమును యే మాత్రము వదలకూడదు. ఏ ఏ దేశముల వారు ఆ దేశాభిమానము పెంచుకోటములో తప్పు లేదు. అయితే తన దేశాభిమానము తాను పెంచుకొని పర దేశములను విమర్శించకూడదు. ఏ మతమును మనము అలక్ష్యను చేయకూడదు. అవిధమైన విశాలభావమును పెంచుకోవాలి.

పరమ పావనమైన భారతావని యందు
సహన మన్నది మనకు చక్కదనము
వ్రతములన్నిటి యందు వన్నెగాంచిన యట్టి
ఘనసత్య శీలమే కఠిన తపము

నిజముగా యీ పవిత్రమైన దేశము యొక్క ఘనతను ఎంత వర్ణించినా కూడను తరగదు తల్లి ప్రేమకంటె అమితమైన ప్రేమను అందించింది దేశము. ఇలాంటి పవిత్రమైన దేశము ను మనము యీనాడు విస్మరించి విదేశములను విశ్వసించి మన జీవితమును భ్రష్టుపట్టిం చుకుంటున్నాము.

కాన విద్యార్థులారా! దేశాభిమానమును పెంచుకొని దేశము యొక్క గౌరవాన్ని దేశము యొక్క సంస్కృతిని, దేశము ఔన్నత్యమును మీరే కాపాడాలి. మీదృష్టియందు లోకాస్సమస్తా సుఖినో భవంతు అందరు సుఖముగా వుండాలనే ప్రార్థన చేయండి. ఏ దేశముపైన గాని ఏ మతముపైన గాని ఏ వ్యక్తిపైనగాని మీకు యేమాత్రము ద్వేషము గాని ఏ విధమైన అయిష్టముగాని మీరు పెంచుకోకూడదు. విశాల భావములను పెంచుకోవాలి. సంకుచితమైన భావములు త్యజించాలి. ఇది భారతీయుల నిజమైన సంస్కృతి. అందువల్లనే ఆర్షమతమందు లోకాస్సమస్తా సుఖినోభవంతు అన్నటువంటి చిరంజీవిత్వమైన యీ పదములు నిరంతరము స్మరిస్తూనే వుండాలి.

విద్యార్థులారా! భగవద్భక్తిని మాత్రము ఎవరే విధముగా మిమ్ములను

హాస్యాస్పదముగా చూసినా దీనిని యే మాత్రము మీరు వదలకండి. భగవత్ప్రేమ లేకపోతే యీ జగత్తంతా శూన్యమే. ప్రేమయే భగవంతుడు. భగవంతుడే ప్రేమ. కనుక యీ ప్రేమను మీరు పెంచుకోండి. ఎలాంటి పరిస్థితులందైన కూడను యీ ప్రేమకు భంగము కలిగించకండి. కష్టములు, నష్టములు, నిందలు, నిష్ఠూరములు ఎన్ని వెంటాడినా భగవత్ప్రేమను మాత్రము వదలకండి. అదే మీ వెంట జంట యింట వుంటూండి మిమ్ములను కాపాడుతూ వస్తుంది. కష్టములు వచ్చినాయని భగవంతుని యే మాత్రము నిందించకూడదు. ఇది నేలో పేరుకున్న స్వార్థము. భగవంతుడు యే నిమిత్తమై, ఏ కారణము చేతనైను కష్టాన్ని అందించాడో అది కూడను ఒక అనుగ్రహ ప్రసాదమనే మీరు భావించాలి. కనుక జీవితము సుఖదుఃఖముల మధ్యలో వుండినటువంటిది. కాన మీరు యీ ప్రాకృతమైన బాధలను యే మాత్రము లెక్క చేయకుండా భగద్ధ్యానమును, భగవద్విసాన్ని ధృఢముగా కలిగివుండినప్పుడు యెన్నైనా ఎదురైనా దానిని సాధించవచ్చు. ఎలాంటి పరిస్థితియందైనా కూడను భగవన్నామమును మీరు మరువకూడదు. ఆ నామమే మీ జీవిత ప్రవాహములో నావగా తోడ్పడుతుంది. కనుక నామస్మరణ చేయండి.